శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## భూముల రీసర్వే వేగవంతం చేయండి



**అల్లూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త** అల్లూరు మండలంలోని భూముల రీసర్వేలో శుక్రవారం జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పాల్గొన్నారు. ముందుగా బీరంగుంట గ్రామంలో భూముల రీసర్వేపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో శీనానాయక్, తహశీల్దార్ చెంచయ్య, కమిషనర్ పణికుమార్, మండల సర్వేయర్ అనురూఫ్, గుమ్మడి సురేంద్ర, సర్పంచ్ షేక్ కరీముల్లాషా ఖాదర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా వక్ఫ్‌బోర్డ్ వైస్ చైర్మెన్‌గా షౌకత్అలీ



**అనుమసముద్రంపేట, డిసెంబర్16ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండలం అనుమసముద్రం గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సిపి నాయకులు షేక్ షౌకత్అలీని నెల్లూరుజిల్లా వక్ఫ్‌బోర్డ్ వైస్‌చైర్మెన్‌గా నియమించిన విషయం విదితమే. అయితే శుక్రవారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మెన్ వి.ఖాదర్‌బాషా, వైసిపి రాష్ట్ర మైనార్టీ విభాగ చైర్మెన్, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, వైసిపి రాష్ట్ర నాయకులు హంజాహుసేన్‌ల చేతుల మీదుగా నెల్లూరు జిల్లా వక్ఫ్‌బోర్డ్ నియామక పత్రాన్ని షౌకత్ అలీ అందుకున్నారు.

## పొగమంచుతో మలిదేవి కాలువలో పడి వ్యక్తి మృతి





**కోవూరు,డిసెంబరు 16 ప్రభాతవార్త :** బర్రెల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించే ఓ కుటుంబంలో పొగమంచు తీరని విషాదాన్ని నింపింది. యథావిధిగా గురువారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో కోవూరు మండలం వేగూరు గ్రామానికి చెందిన ఎం. రఘు(45) తన బైక్‌లో బర్రెలను కొనుగోలు చేసేందుకు విడవలూరు వెళ్లేదారిలో మలిదేవి కాలువ ప్రాంతంలో ప్రమాదవశాత్తు పొగమంచు కారణంగా కాలువలో పడిపోయాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ రావడం, ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కోవూరు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున ఉదయం సదరు మోడేగుంట సమీపంలోని మలిదేవి కాలువలో వాహనం పడి ఉండడంతో ఆ ప్రాంతంలో వెతకగా రఘు మృతదేహం కానవచ్చింది. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని కోవూరు పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి , కేసైఉ నమోదు చేసి దర్యాదు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రఘు ఆకస్మిక మృతి కారణంగా ఆ ప్రాంతంలో విషాదచాయలు నెలకొన్నాయి.

## ప్రధాన రాజకీయ పార్టీలన్నీ పాలకవర్గ పక్షమే



**నెల్లూరు టౌన్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** సుప్రీం కోర్టు ధర్మాసనం 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌పై చెప్పిన తీర్పును ప్రధాన రాజకీయ పార్టీలన్నీ పాలకవర్గ పక్షపాతమైనదని స్పష్టంగా తెలుస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని హోటల్ రాధే గెస్ట్ ఇన్‌లో జిల్లాలోని బీసీ సంఘాల నాయకులతో జరిగిన చర్చా వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. గడచిన అనుభవాలను పరిగణనలోకి తీసుకుంటే దేశాన్ని దీర్ఘకాలికంగా పరిపాలించిన కాంగ్రెస్ పార్టీకి గాని నిత్యం హిందుత్వంపై మాట్లాడే భారతీయ జనతా పార్టీలకు బీసీల సంక్షేమము ఏ మాత్రం పట్టలేదని ఆయన తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత తీర్పు నేపథ్యంలో రిజర్వేషన్లను రద్దుపరిచింది కులాల ప్రజలకు వారి వారి సంఖ్యను, వనరులు, అవకాశాలను సమాజంగా పంచిపెట్టాలని ఆయన కోరారు. స్వాతంత్ర్యానికి ముందు హయాంలో 1931లో జరిగిన మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో ఎస్సీ ఎస్టీలతో పాటు బీసీలకు కూడా రిజర్వేషన్ కల్పించాలని తీర్మానం చేయగా అప్పటి కాంగ్రెస్ నేతలు తిర్కరించారని ఆయన వవాపోయారు. మురార్జీ దేశాయ్ ప్రధాన మంత్రిగా నియమించిన బీసీ మండల్ కమిషన్ బీసీ రిజర్వేషన్ 27 శాతం తప్పనిసరిగా అమలు చేయాలని సూచిస్తూ సమర్పించచిన నివేదికను ఆ తరువాత ప్రధాన మంత్రులుగా పని చేసిన ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ సైతం ఆనాడు పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా రిజర్వేషన్లు అమలవుతున్నప్పటికీ బడుగు వర్గాల అభివృద్ధి ఏ మాత్రం ఉందో అర్థం అవుతుందో కళ్లారా చూసుకునే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యం రిజర్వేషన్ల విధానంపైనే సమీక్ష జరగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన సూచించారు. భారతదేశం అంటే కులాలతో కూడిన సమాజం అని కులాలు అభివృద్ధి చెందితే దేశం గణనీయంగా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని జనాభా లెక్కలతో కులాల వారీగా సేకరించి తద్వారా గణన తేల్చాలని, ఆయా కులాల జనాభాను బట్టి సమాజంలో ఉన్న రాజకీయ పదవులు సమానంగా పంపిణీ చేసినప్పుడే అందరికీ సమన్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఓబీసీల సంఘాలు కోరుకునే విధంగా రానున్న రోజుల్లో జనాభా లెక్కల సేకరణకు కులాల వారీగా సేకరించి అన్ని కులాలకు సమాన వనరులు అవకాశాలు అందేలా చూడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్, నెల్లూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయమ్మ, మన్యం కళ్యాణి, కాకు కృష్ణకుమారి, కోమారి వేణుగోపాల్, దూదేకులు నూర్‌బాషా, ముస్లీం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ సలీం, నాయకులు భాస్కర్‌గౌడ్, లక్ష్మీ, ప్రమీలమ్మ, వెంకటరమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

## కనులవిందుగా శ్రీకృష్ణుడికి పుష్పయాగం



**కావలి, డిసెంబరు 16 ప్రభాతవార్త** కావలి పట్టణ రైల్వే రోడ్డులోని గీతా మందిరంలో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ వేడుకలలో భాగంగా చివరి రోజు శ్రీకృష్ణుడుకి వివిధ రకాల పుష్పాలతో చేసిన పుష్పయాగం భక్తుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ పుష్పయాగం కనులవిందుగా సాగింది. శ్రీకృష్ణ పరమాత్మకు మహాశాన్తి అభిషేకం, ప్రోక్షణ, పుణ్యాహం, అగ్నిప్రణయనం, కలశారాధన, ఉక్తహోమం, పూర్ణాహుతి, ఆలయ ప్రదక్షిణం, విమాన కలశ ప్రోక్షణ, ఆవాహన, ప్రాణ ప్రతిష్ట, గోదర్శనం, నవనీత హారతి, అక్షతారోపణ, ఆచార్య సన్మానం, యజమాన ఆశీర్వచనం, అన్నసంతర్పణ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ వేడుకలలో కావలి పోస్టల్ ఏజెంట్ గట్టుపల్లి వెంకటేశ్వర్లు అహర్నిశలు పాటుపడి భక్తుల ప్రశంసలు అందుకున్నారు. ఈ ఆలయ జీర్ణోద్ధరణకు 5 లక్షలు పైచిలుకు విరాళాన్ని ఆయన అందజేసి అందరి అభినందనలు అందుకున్నారు. నాలుగు రోజుల పాటు భక్తులకు సౌకర్యాలు కల్పిస్తూ వేడుకల విజయానికి గట్టుపల్లి వెంకటేశ్వర్లు ఎంతో కృషి చేశారు.

## నీలం సాయిని పరామర్శించిన బియంఆర్



**అల్లూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త** వైసిపి సీనియర్ నాయకులు నీలం సాయి కుటుంబాన్ని శుక్రవారం రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం నీలం సాయికుమార్ తండ్రి మస్తానయ్య అనారోగ్యంతో మరణించడంతో నీలం సాయిని బీద మస్తాన్‌రావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బీద రమేష్‌యాదవ్, ఎంపిటిసి ఎస్.రఘులు పాల్గొన్నారు.

# దెబ్బతిన్న పొగాకు పంటను పరిశీలించిన సిటీఆర్‌ఐ బృందం



**మర్రిపాడు,డిసెంబర్16ప్రభాతవార్త:** మాండూస్ తుఫాన్ వలన డిసిపల్లి పొగాకు వేలం కేంద్ర పరిధిలో దెబ్బతిన్న పొగాకు పంటలను పొగాకుబోర్డు, సిటిఆర్‌ఐతో కూడిన బృందం శుక్రవారం పర్యటించింది. దెబ్బతిన్న పొగాకు పంటను పరిశీలించిన అధికారులు ఎక్స్‌టెన్షన్ మేనేజర్ దామోదర్ మాట్లాడుతూ మాండూస్ తుఫాన్ వలన దక్షిణ ప్రాంతంలో చాలా భాగాల్లో పొగాకు బాగా దెబ్బతినిందని, పొగాకు రైతులకు సలహాలు ఇచ్చేందుకు, పంట నష్టాన్ని అంచనా వేసేందుకు పొగాకు బోర్డు నాలుగు బృందాలను వేసి ఆయా ప్రాంతాల్లో పొగాకు తోటలను పరిశీలించారన్నారు.

సిటిఆర్‌ఐ శాస్త్రవేత్త ఎం.అనసూరాధ మాట్లాడుతూ పొలాల్లో ఉన్న నీరు వీలైనంత త్వరగా బయటకు తీసివేయాలన్నారు. నీరు ఉంటే మొక్క వేరుకు నేలలో శ్వాస అందక మొక్కత్వరగా చనిపోతుందన్నారు. అనుకూలమైన తేమ ఉంటే వీలైనంత త్వరగా అంతర్‌సేధ్యం చేయాలన్నారు. పంటలో అదనంగా వారి పొలానికి సరిపోయే అమోనియం సల్ఫేట్‌ను వేయాలన్నారు. దానివలన మొక్కలకు తెగుళ్ళు శోకకుండా సిలీంద్రియ నాసిని కొసైడ్, కార్బోయోటాప్ పిచికారీ చేయాలన్నారు. మొక్కలు వేరు ద్వారా పోషకాలను తీసుకోలేదు. కావున నీటిలో కరిగే ఎరువులైన 19.19.19లేదా 13.0.45లను పైపాటుగా పిచికారీ చేయాలన్నారు. పొగాకు నారుమడులను కూడా జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఆక్షన్ సూపరె న్టెంట్ ఎం.శంకర్‌రావ్, మార్కెటింగ్ సిటిఆర్ఐ శాస్త్రవేత్తలు పూర్ణబిందు, కె.ప్రభాకర్‌రావ్, డిసిపల్లి పొగాకుబోర్డు వేలం అధికారి జి.రాజశేఖర్, రైతుసంఘం అధ్యక్షుడు గాలి నరసపనాయుడు, పొగాకుబోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు



**గుడ్లూరు, డిసెంబరు 16, ప్రభాతవార్త** నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జేసీ పద్మ రామాయపట్నం పోర్టు అధికారులపై మండిపడ్డారు. గురువారం రాత్రి తుదిలో తప్పిన ప్రమాదానికి రైతులు ఆందోళన చెంది రామాయపట్నానికి వెళ్తున్న అధికారులు టిప్పర్లను చేవూరు గ్రామస్తులు అడ్డుకున్నారు. గురువారం రాత్రి రైతులకు చేవూరు గ్రామస్తులకు పోర్టు తరుపున శుక్రవారం రోజు మాట్లాడతామని జేసీ పద్మావతి తెలుపగా అదేవిధంగాచేవూరు గ్రామస్తులతో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్తులకు ఇక నుంచి ఎలాంటి తప్పులు జరగకుండా గ్రామానికి అనుగుణంగా ప్రజలందరికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు సాగుతామని ఆమె గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గతంలో గ్రామం నుంచి భూములను తీసుకున్నా ఉద్యోగ సౌకర్యం కలిగిస్తామని ఇప్పుడు కొంతమందికి మాత్రమే అవకాశం ఇస్తూ పక్షపాత వైఖరిని గ్రామంలో చూపించి గ్రామంలో అనేక మందిని ఒకరికి ఒకరు కాకుండా పోర్టు అధికారులు చేస్తున్నారని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. తమ దృష్టికి మొదటి సారిగా ఈ సమస్య వచ్చింది కాబట్టి ఇక నుంచి గ్రామానికి ఎలాంటి ఇబ్బందులు కలిగే కార్యక్రమాలు జరగకుండా ముందకు నడుచుకుంటారని ఇప్పటి వరకు జరిగిన వాటిలో ఎవరు తప్పుకున్నప్పటికి వారిని మందలిస్తామని ఇక నుంచి రైతులు వారి పొలాల్లో గాని, గ్రామంలో గాని పోర్టుకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉండవని ఆమె గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

## ఆకట్టుకున్న సైన్స్‌ఫేర్

**చేజర్ల, డిసెంబర్16ప్రభాతవార్త:** మండల కేంద్రమైన చేజర్లలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం జరిగిన సైన్స్ ఫేర్ పలువుర్ని ఆకట్టుకుంది. చేజర్ల మండల విద్యాశాఖాధికారి పంచాగ్నుల కళాధర్ ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని ఆలోచనలను రాబట్టేందుకు సైన్స్ ఫేర్‌లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. నూతన ఒరవడులను సృష్టించేందుకోసం ఇలాంటి సైన్స్ ఫేర్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మండలంలోని అన్ని ఉన్నతపాఠశాలల్లోని విద్యార్థుల చేత ఈ సైన్స్ ఫేర్‌ను నిర్వహించారు . జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు సైన్స్ ఫేర్‌ను ప్రారంభించినట్లు కళాధర్ పేర్కొన్నారు .ఆదూరుపల్లి, నాగులవెలటూరు, తూర్పుపల్లి , తూర్పుకంభంపాడు , మాముదూరు ఉన్నతపాఠశాలల్లో విద్యార్థులు పలు రకాల ప్రయోగాల నమూనాలను ప్రదర్శించారు. ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయుల సహకారంతో ప్రాజెక్ట్‌లను తయారుచేశారు. సాంకేతికపరమైన ఆలోచనలతో విద్యార్థులు తయారుచేసిన ఈప్రాజెక్టులు పలువురిని ఆకట్టుకున్నాయి. చేజర్ల ఉన్నతపాఠశాల ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ బోయిళ్ళ ప్రసాద్‌రెడ్డి , మండలంలోని సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నెల్లూరులో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



**నెల్లూరు టౌన్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు సమీపంలోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్భా కళా క్షేత్రంలో శుక్రవారం రాత్రి క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు ఈ కార్యక్రమంలో పాల్గొని బెలూన్‌లు వదిలి వేడుకలను ప్రారంభించారు. జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి ఎస్.కనకదుర్గ భవాని ఈ సందర్భంగా కలెక్టర్‌కు పూల గుత్తులు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ స్రవంతి, బిషప్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

## కేతిరెడ్డి నివాసానికి మంత్రి కాకాణి



**కావలి, డిసెంబరు 16 ప్రభాతవార్త** కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డికి అత్యంత ఆప్తుడైన వైసిపి మాజీ పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి నివాసానికి శుక్రవారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విచ్చేశారు. కావలి బృందావనం హౌసింగ్ కాలనీలో నివసిస్తున్న శివకుమార్‌రెడ్డి కుమార్తె, అల్లుడు నూతన దంపతుల్ని మంత్రి కాకాణి ఆశీర్వదించారు. ఆయన నివాసంలో ఎమ్మెల్యే, మంత్రి కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. ఇటీవల కావలిలో జరిగిన వివాహానికి మంత్రి కాకాణి హాజరుకాకపోవడంతో ఈ రోజు కేతిరెడ్డి నివాసానికి వచ్చి నూతన దంపతుల్ని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శివారెడ్డి, శ్రీశైలం దేవస్థాన డైరెక్టర్ కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, కొండబిట్రగుంట పాలకమండలి చైర్మన్ శ్రీరాంమాల్యాద్రి, రెడ్‌క్రాస్ బాధ్యులు, కావలి ఏరియా వైద్యశాల అడ్వయిజరీ కమిటీ బాధ్యులు కలికి శ్రీహరిరెడ్డి, వైసిపి నేతలు కుందుర్తి సోదరులు, కనమర్లపూడి వెంకట నారాయణ, ప్రముఖ బిల్డర్ కేతిరెడ్డి బాలకృష్ణారెడ్డి, అయ్యవారు కృష్ణారెడ్డి, సన్నిబోయిన ప్రసాద్ యాదవ్(చెన్నాయపాళెం ప్రసాద్) తదితరులు మంత్రికి స్వాగతం పలికారు. కేతిరెడ్డి కుటుంబ సభ్యులు మంత్రిని ఘనంగా సత్కరించారు. మంత్రి కాకాణి అల్పాహారం తీసుకొని వెళ్లారు. అయితే కావలి తుమ్మలపెంట రోడ్డులో వైసిపి కావలి నియోజకవర్గ కీలక నేత, కనిగిరి వైసిపి పరిశీలకులు భారీ స్థాయిలో నిర్వహిస్తున్న సహస్ర చండీయాగం వైపు కన్నెత్తి చూడకుండా మంత్రి కాకాణి బృందావనం కాలనీ నుంచి నెల్లూరుకు వెళ్లడం పట్ల వైసిపి వర్గాలలో తీవ్ర చర్చనీయాంశమైంది. మన్నెమాల అనుయాయులు జీర్ణించుకోలేకపోతున్నారు.

# తాగునీరు, పారిశుద్ధ్యంపై అవగాహన పెంచండి



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** పరిశుభ్రమైన తాగునీటి వినియోగంతోనే ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యపడుతుందని, ప్రజలందరికీ పారిశుద్ధ్యంతో పాటు మంచినీటి పరిశుభ్రతపై అవగాహన పెంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. యూనిసెఫ్ - సార్ఫ్ - నవజీవన్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణ నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత అనే అంశాలపై కార్పొరేషన్ కార్యాలయంలోని పురసేవ సమావేశ మందిరంలో శుక్రవారం కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, ఆరోగ్యమిత్ర వలంటీర్లు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమిషనర్ హాజరై మాట్లాడుతూ నగరవ్యాప్తంగా మంచినీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఉత్తమ ప్రణాళికలను సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి కనెక్షన్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, తాగునీటి స్వచ్ఛతకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని కమిషనర్ తెలిపారు. రాబోయే రోజుల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా విస్తృత స్థాయిలో పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు చేపట్టి నగరాన్ని సుందరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. నగరంలో తాగునీరు, పారిశుధ్య సమస్యను పరిష్కరించేందుకు సాయం చేస్తున్న ఏఐఐబి బ్యాంకు వారికి, పట్టణ నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ సంస్థలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఈఈ సంజయ్, డీఎంహెచ్‌వో డెమో అధికారి శ్రీనివాసరావు, నవజీవన్ సంస్థ డైరెక్టర్ సహదేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల్లా మారిన పొలాలు -దెబ్బతిన్న వరినారుమళ్ళు



**సంగం డిసెంబర్ 16 ప్రభాతవార్త** మాండూస్ తుఫాన్ రైతులను నిలువునా ముంచింది. గత రెండు సంవత్సరాలగా నవంబర్ నెలలో తుఫాన్ వస్తుందని ఆగి డిసెంబర్ నెలలో నారులు పోసుకుంటే రైతులు నిలువునా మునిగి పోయారు. సంగం మండలం దువ్వూరు గ్రామంలోని రైతులు నార్లన్ని దెబ్బతిని పోయాయని తీవ్ర ఆవేదన చెందుతున్నారు. డ్రైన్‌లన్ని పూడిపోయి పూడిక తీసేవారు లేక తుఫాన్ కారణంగా కురిసిన వర్షానికి వరదనీరు మొత్తం పొలాలలో ఆగిపోవడంతో నార్లు, నారుమళ్లు పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి దువ్వూరు రెవిన్యూ పరిధిలోని ఇరిగేషన్ డ్రైన్‌లు పూడికతీయించి వరదనీరు బయటకు వెళ్లే విధంగా చేయాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు.

## పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షులుగా లెనిన్



**నెల్లూరు టౌన్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నెల్లూరు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా టి.లెనిన్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.నరేష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఉద్యమించాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థి సంఘంపైన ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై దేశ వ్యాప్తంగా 48 సంవత్సరాలుగా పిడిఎస్‌యు రాజీ లేని పోరాటం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం అమలు చేస్తూ దేశవ్యాప్తంగా ప్రభుత్వ విద్యను ప్రైవేటీకరణ కాషాయకరణ చేయడానికి సిద్ధమైందని ఆరోపించారు. నూతన విద్యా విధానం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తుందన్నారు. నాడు నేడు పనులు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కలుగజేస్తామని చెబుతున్న ప్రభుత్వం 3, 4, 5 తరగతులను హైస్కూల్‌లో విలీనం చేయడం అన్యాయం అన్నారు. దానికి సంబంధించి జీవో నెంబరు 84, 117లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైస్కూల్‌లో ప్రాథమిక పాఠశాలలను విలీనం చేయడంతో 30 వేల మంది ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం మిగులు చూపిస్తుందన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ప్రస్తుత ధరలకు అనుకూలంగా మెస్ మరియు కాస్మొటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యా సంస్థలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం విద్యా వసతి దీవెన అందిస్తుందని, ఇదంతా సంతోషకర విషయమన్నారు. ప్రైవేటు ఎయిడెడ్ విద్యా సంస్థలలో పీజీ చదువుతున్న విద్యార్థులకు విద్యావాసం దీవెన ఇవ్వకుండా జీవో నెంబరు 77ను ప్రభుత్వం తీసుకొస్తుందన్నారు. నెల్లూరు జిల్లాలో విక్రమ సింహపురి విశ్వ విద్యాలయంలో పరీక్షల విభాగంలో జరిగిన ప్రభుత్వం విచారణ జరపాలని అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎంపిక కాబడిన జిల్లా అధ్యక్షులు టి.లెనిన్, ప్రధాన కార్యదర్శి ఎన్.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ వచ్చాడు.. నిండా ముంచాడు



**గుడ్లూరు, డిసెంబరు 16, ప్రభాతవార్త** : ముఖ్యమంత్రి జగన్ పరిపాలనలో ప్రజలు నిండా మునిగారని గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షుఉ జనిగర్ల నాగరాజు అన్నారు. కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలతో గుడ్లూరు మండలంలోని మొగుళ్లూరు గ్రామంలో 'ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి' కార్యక్రమానికి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో నాగరాజు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అన్ని నమ్మి ఓటేసే జగన్‌మోహన్‌రెడ్డి ఇంతలా మోసం చేస్తాడని అనుకోలేదంటూ ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. వృద్ధాప్య పింఛన్ రూ.3వేలు చేస్తానని నమ్మించి ఏడాదికోసారి రూ.250లు పెంచడం మోసం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు సంపూర్ణ మద్యపాన నిషేధం అని చెప్పి తీరా గెలిచాక ఊరూరా బెల్టు షాపులను ఏర్పాటు చేయడంతో పాటు, పిచ్చి బ్రాండ్లను అమ్ముతూ ప్రజల ప్రాణాలు తీస్తున్నాడని విమర్శించారు. ఈసారి ఎన్నికల్లో 175కి 175 సీట్లు వస్తాయని వైసీపీ నేతలు పగటి కలలు కంటున్నారని నాగరాజు ఎద్దేవ చేశారు. చంద్రబాబునాయుడు ఒక్కరే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలరని, ప్రజలు ఈ సారి టీడీపీని గెలిపించేందుకు సిద్దంగా ఉన్నారని నాగరాజు తెలిపారు. అంతకముందు పార్టీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ పార్టీ అధ్యక్షులు లక్కంరాజు హరిబాబుతో పాటు క్లస్టర్ ఇంఛార్జి ఉమ్మనేని సుబ్బారావు, పార్టీ నాయకులు బబ్బూరి నాగేశ్వరరావు, రాచూరి అంజయ్య, అక్కిలగుంట ప్రకాశం, పువ్వాడి వేణు, మేకలపోతలు రాఘవయ్య, చిత్తారి మల్లిఖార్జున, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్‌భవ సర్వేలో ముందుండాలి



ఉదయగిరి డిసెంబర్ 16 ప్రభాతవార్త: ఉదయగిరి మండలంలోని ఉదయగిరి బిట్-3 సచివాలయాన్ని ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.అక్కడ ఆయుష్మాన్‌భవ సర్వేపై అందరు వెనుకబడి ఉన్నారని సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ తప్పనిసరిగా వినియోగించాలని తెలిపారు.వాలింటర్లు సచివాలయానికి వందశాతం హాజరు నమోదు చేయాలని తెలిపారు. సచివాలయ సిబ్బందని వాలింటర్లను ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొని రావాలని అలా వచ్చిన సమస్యలను ఖచ్చితంగా పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఖాదర్‌ఖరిముల్లా,మండల కోఆర్డినేటర్ గాజుల ఇమ్రాన్,సచివాలయ సిబ్బంది,వాలింటరీలు పాల్గోన్నారు.

## అభ్యసనాభివృద్ది కార్యక్రమంపై శిక్షణ



**ఉదయగిరి డిసెంబర్ 16 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలోని గండిపాళెం బాలుర గురుకుల పాఠశాలలో నాలుగు మండలాల ప్రధానోపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈట్రైనిం గ్ కోర్స్ డైరక్టర్ షేక్ మస్తాన్ వలి ముఖ్య అతిధిగా పాల్గోన్నారు. ఈకార్యక్రమాలు 12 వ తేది నుండి 21 వ తేది వరకు 9 రోజులు పాటు జరుగుతాయని ఆయన తెలిపారు.4,5,6 అండర్‌స్టాండ్‌హెల్మంట్ 5 ఫీడ్‌బ్యాక్,6 క్రిటికిల్ తింకింగ్, అనే కార్యక్రమాలపై సోషల్ ఎమోషనల్‌స్కిల్,7 అటానమీ,8,9 కలిసి సోషల్ కోలాబిరేషన్ అనే అంశాలపై శిక్షణా కార్యక్రమం జరిగినది.ఈకార్యక్రమానికి ఉదయగిరి, సీతారామపురం,దుత్తలూరు,వరికుంటపాడు,వింజమూరు, మండలాలకు చెందిన 44 మంది ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,ఆర్‌పిలు సిహెచ్ శ్రీనివాసులు, కె వెంకటరమణ,పాల్గోన్నారు. ఈకార్యక్రమాన్ని వెంగళరావు నగర్ ప్రధానోపాధ్యాయులు కో డైరక్టర్‌గా ఎస్‌కె నూర్జహాన్, ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది.

## తూర్పుపల్లి ప్రధానోపాధ్యాయులుగా భాస్కర్‌రెడ్డి



**చేజర్ల,డిసెంబర్16ప్రభాతవార్త:** తూర్పుపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులుగా సోమవరపు భాస్కర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు సమగ్ర శిక్షలో కమ్యూనిటీ మొబలైజర్‌గా భాస్కర్‌రెడ్డి పనిచేసేవాడు . తూర్పుపల్లిలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న దుర్భా కృష్ణమూర్తి విఆర్ఎస్ ఇవ్వడంతో నవంబరు ఆఖరుకు ఆస్థానం ఖాళీ అయ్యింది. దీంతో భాస్కర్‌రెడ్డి తూర్పుపల్లి ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారు. పాఠశాలలో అన్ని వసతులను కల్పించడంతోపాటు విద్యార్థుల సంఖ్యను పెంచడానికి , విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు, పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన భాస్కర్‌రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు. ఆత్మకూరుఎంపిపి కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి, ఎపిటిఎఫ్ చేజర్ల మండల అధ్యక్షుడు ఖాజారెడ్డి , ప్రధాన కార్యదర్శి రఫి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**మనుబోలు, డిసెంబరు 16 ప్రభాతవార్త** సేవానాదం ట్రస్ట్ వ్యవస్థాపకులు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి జన్మదినాన్ని మనుబోలు భవిత దివ్యాంగుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిధులుగా బాలుర హైస్కూలు హెచ్‌యం డేవిడ్, బాలికల హైస్కూలు హెచ్‌యంలు పాల్గొన్నారు. హెచ్‌యం డేవిడ్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదువుకునే చిన్న పిల్లలు దేవుళ్ళతో సమానమన్నారు. ఇలాంటి దేవాలయంలో శ్రీనాథ్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు జరపడం అభినందనీయమన్నారు. ఆయన ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని భవిష్యత్‌లో కూడా మరెన్నో కార్యక్రమాలు చేసి ఇలాంటి పుట్టిన రోజులు ఎన్నో జరుపుకోవాలని అదే విధంగా వారి బృందాన్ని కూడా ప్రత్యేకంగా అభినందించారు. బాలకల హైస్కూలు హెచ్‌యం వసంతలక్ష్మి మాట్లాడుతూ మాన్ రిలేషన్స్ ఆర్ మనీ రిలేషన్స్‌గా మారుతున్న ఈ రోజుల్లో సేవ చేయాలనే తపనతో మాచిరెడ్డి ముందుకు రావడం అభినందనీయమన్నారు. భవిత పాఠశాల హెచ్‌యం మాట్లాడుతూ మా పాఠశాలకు ఫలాన సామాగ్రి అవసరమని చెప్పగానే స్పందించి మాచిరెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకొని లక్ష రూపాయలు విలువ చేసే సామాగ్రిని మాకు అందజేసిన శ్రీసేవానాదం ట్రస్ట్ వ్యవస్థాపకులు, సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆంధ్ర చిప్స్ అధినేత రాంప్రసాద్, ట్రస్ట్ టీచర్లు,సభ్యులు భార్గవ్, వెంకటేశ్వర్లు, మహిధర్‌రెడ్డి, సురేష్ గౌడ్, కొమరల శ్రీకాంత్, పి.శ్యామల, ఎస్.కె.షర్మిల, గిరీష్, తుపాకుల గిరి, సాయిశర్మ, పవన్, చాలా పక్షి శీను, లాజర్, ప్రేమ్, అనిల్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## దెబ్బతిన్న ఉద్యాన పంటలు పరిశీలన



**వరికుంటపాడు,డిశంబర్16,ప్రభాతవార్త:** మాండస్ తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ఉద్యానవన పంటలను ఉదయగిరి ఇన్‌చార్జ్ ఉద్యాన శాఖాదికారి షేక్.షాహిల్‌గురువారం పరిశీలించారు.వేంపాడు, విరువూరు, వరికుంటపాడు గ్రామాలలో సాగులో వున్న బొప్పాయి,మిరప పంటలను ఆయన పరిశీలించి దెబ్బతిన్న పంటలను నమోదుచేసుకున్నారు.పంటపొలాలలో నీరు నిల్వ వుండడంవల్ల మొక్కలు చనిపోతాయని రైతులు జాగ్రత్త వహించాలని సూచించారు.మిరప పంటలో నిల్వ వున్న నీరు తీసివేసి ఎకరాకు 50నుండి 60కిలోల యూరియ,మూరిటాఫ్ పోటాష్ వేయాలని కాయలు కృళ్ళి పోకుండా అమిస్టర్1 ఎం.ఎల్ లేదా కాఫర్ హైడ్రాక్సైడ్ 2.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని తెలిపాడు.బొప్పాయి పంటలో మెటలాకీజెల్ ఎం.టు 3గ్రాములు లేదా కాఫర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు తీసుకొని1లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకుంటే పంట నష్టం తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో వి.ఎ.ఎలు చంద్రశేఖర్,శారధ,వెన్నెల,రైతులు పాల్గొన్నారు.

## నేడు భైరవకోనకు ధనుంజయరెడ్డి రాక

**సీతారామపురం డిసెంబర్ 16 ప్రభాతవార్త:** సీతారామపురం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన ఆలయాన్ని ఉదయం 10 గంటలకు స్వామి వారిని దర్శించుకునేందుకు ఉదయగిరి నియోజవకర్గ పరిశీలకులు వైసిపి పి.ఇ.సి సభ్యులు కొడవలూరు దనుంజయరెడ్డి శనివారం రానున్నారని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారిని,అమ్మవారిని దర్శించుకొని అనంతరం సీతారామపురం మండలంలో పర్యటించి మండలంలోని వైసిపినాయకులు,కార్యకర్తలను కలుసుకొని సమావేశం నిర్వహించి బూత్‌కమీటిలు,సచివాలయ కమీటిల ఏర్పాటు గురించి చర్చించనున్నారు.

## డాక్టర్ అబ్దుల్ కలాంని ఆదర్శంగా తీసుకోవాలి



**సీతారామపురం డిసెంబర్ 16 ప్రభాతవార్త:** సీతారామపురం ఆదర్శ పాటశాలలో మండల స్ధాయి సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని ఎంఇఒ మస్తాన్ వలిప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఒక పేదింటి బిడ్డ అబ్దుల్ కలాం మన నెల్లూరు జిల్లాలోని షార్ అంతరిక్ష పరిశోదన కేంద్రం యొక్క కీర్తి ప్రపంచ నలుమూలలకు తెలిసోచ్చేలా చేశారని కొనియాడారు. ఒక సైంటిస్టుగా ఉండి ఈ భారతదేశానికి రాష్ట్రపతి కావడం ఎంతో గొప్పవిషయమని అన్నారు.ప్రతి ఒక్క విద్యార్ధి ఆయనను స్పూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. సైన్స్ పితామహుడు సి.వి రామన్‌ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని సూచించారు. ఉపాధ్యాయుల సహకారంతో కొత్తకొత్త ప్రయోగాలు చేయాలని సూచించారు.సైన్స్ ఎగ్జిబిషన్ కో ఆర్డినేటర్ పి . శ్రీనివాసులు మాట్లాడుతు మండలస్ధాయిలో 25 మంది విద్యార్ధిని విద్యార్దులు తమ సైన్స్ ప్రయోగాలతో ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారని జిల్లా స్ధాయిలో 5 మంది విద్యార్దులు అర్హత సాధించారని తెలిపారు.కీర్తన్ (బసినేనిపల్లి),ఎస్ .శృతి ( సీతారామపురం), ఐ మర్యారాణి ( అయ్యవారిపల్లి),సిహెచ్ స్నేహసార (సీతారామపురం), కె నిహారిక ( గౌతమి)హైస్కూల్, ఎంపికైయ్యారని ప్రధానోపాధ్యాయులు జిల్లా స్ధాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలకు పంపిస్తారని తెలిపారు.ఈకార్యక్రమంలో అయ్యవారిపల్లి హెచ్ఎం ప్రభాకర్,ఉపాధ్యాయుడు విజయాయాదవ్, బావన, వాసంతి, ఎన్. కళ్యాణి,మస్తాన్,పాతిమా, బి.వి .నారాయణ, పి.శ్రీనివాసులు, పి.రవికుమార్, తదితరులు పాల్గోన్నారు.

## గిరిలో వైకాపా జెండాను ఎగురవేద్దాం



**వింజమూరు,డిసెంబర్16ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గంలో 2024ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ గెలుపుకు నేతలంతా సమిష్టిగా పనిచేసి విజయబావుటాను ఎగురవేసేందుకు సైనికుల్లా తయారు కావాలని నియోజకవర్గ పరిశీలకులు కొడవలూరు ధనుంజయరెడ్డి వింజమూరు వైకాపా నేతలకు దిశ, నిర్దేశం చేశారు. శుక్రవారం వింజమూరు మండలం నుండి 10వాహనాల్లో సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, పార్టీ ముఖ్య నేతలు నెల్లూరులోని ధనుంజయరెడ్డి ఆఫీసులో మర్యాదపూర్వకంగా శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ పరిశీలకులుగా పార్టీ అధిష్టానం నియమించడం ఎంతో సంతోషకరమన్నారు. మెట్టప్రాంత ముద్దుబిడ్డ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపుకు సైనికులుగా పనిచేస్తామని పరిశీలకులకు తెలిపారు. త్వరలోనే ఉదయగిరి నియోజకవర్గ పర్యటన ఖరారవుతుందని ప్రతి మండలంలోని నేతలతో, కార్యకర్తలతో సమావేశమై పార్టీ గెలుపుకు చేపట్టాల్సిన చర్యలను గురించి చర్చిస్తామని ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. వైకాపా మండల కన్వీనర్ రేవునూరి శ్రీనివాసులురెడ్డి, ఎంపిపి ఇనగనూరి మోహన్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మెన్ జూపల్లి రాజారావ్ ,కాటేపల్లి ఎంపిటిసి సభ్యులు పల్లా మల్లిఖార్జున, వింజమూరు సర్పంచ్ నల్లగొండ్ల సృజన, బుక్కాపురం సర్పంచ్ రసూల్, చింతలపాళెం సర్పంచ్ రమణారెడ్డి, నేతలు బయపురెడ్డి విజయక ృష్ణారెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, నీలం సంజీవరెడ్డి, లెక్కల సుధాకర్‌రెడ్డి, సూరం వినోద్‌రెడ్డి, రొడ్డా కొండయ్య, భోజనపు గోపి , రావూరు పెంచలరెడ్డి, మండాది గోవిందరెడ్డి, బండి కృష్ణారెడ్డి, మద్దూరి చంద్రశేఖర్‌రెడ్డి , ఎనిమిెండ్డి కొండలరావ్, కొండపల్లి రమేష్, రాయుడు , పోలుబోయిన వెంకటేశ్వర్లు , చిలకల కృష్ణారెడ్డి, అంకినపల్లి నర్సింహారెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, జనార్ధనపురం సర్పంచ్ దోసాని రమణయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## నరసింహస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు



**కలువాయి డిసెంబర్ 16ప్రభాతవార్త:**కలువాయి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం దనుర్మాస వ్రత పూజలను ఆలయ వ్యవస్థాపకులు నరసయ్యాస్వామి ఆద్వర్యంలో ప్రధానార్చకులు సోమశేఖర్‌స్వామి వైభవంగా నిర్వహించారు. అమ్మ వారికి విశ్వకేషన ఆరాధాన, పుణ్యాహవచనం, స్తప్నతి రువం జనం,తిరువారాధన, అష్టోత్తర పూజలు, నైవేద్యం ,మంత్రపుష్పం,తీర్ధ ప్రసాదగోష్టి,అమ్మవారిక విశేష అలంకరణ నిర్వహించారు. ధనుర్మాస వ్రతంను గోదాదేవి రంగనాధస్వామి కొరకు 30 రోజులు ధనుర్మాస వ్రతంను ఆలయం నందు ఆచరించడం జరుగుతుందని ప్రధానార్చకులు తెలిపారు.

## దళిత యువకుడిని చంపిన అనంతబాబుకు ఘనస్వాగతం సిగ్గుచేటు

**కావలి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** దళిత యువకుడు సుబ్రమణ్యంను చంపిన ఎమ్మెల్సీ అనంతబాబుకు ఘనస్వాగతాలు పలకడం సిగ్గుచేటు అని టిడిపి నెల్లూరు పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షులు కాకి ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు.ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళితులపై రోజురోజుకు దాడులు జరుగుతున్నాయన్నారు. దాదుల్ని నిర్మూలించాల్సిన ప్రభుత్వం దాడులు చేసిన వాళ్ళకు సహకరించడం వైసిపి అరాచక పాలనకు నిదర్శనమన్నారు. దళిత యువకుడు, కారు డ్రైవర్ వీధి సుబ్రమణ్యంను ఎమ్మెల్సీ అనంతబాబు తనే చంపినట్లు పోలీస్ విచారణలో ఒప్పుకున్నాడన్నారు. అలాంటి వ్యక్తికి సుప్రీం కోర్టులో బెయిల్ వచ్చే విధంగా ప్రభుత్వం సహకరించడం దారుణమన్నారు. ఆయనతో పాటు సహ నిందితులను విచారించకపోవడం కేసును నీరుగార్చడమేనన్నారు. సెంట్రల్ జైలు ప్రాంగణంలోకి వాహనాల అనుమతి లేకపోయినా అతని అనుచరులు కాన్వాయ్‌తో ప్రవేశించి అనంతబాబును గజమాలతో సత్కరించడం ఎటువంటి సంకేతాలు ఇస్తుందన్నారు. ఈ రాష్ట్రం ఎటుపోతుందో ప్రజాస్వామిక వాదులు ఆలోచించాలన్నారు. అనంతబాబుకు బెయిల్ ఇవ్వడం వల్ల సాక్షులను ప్రభావితం చేసే పరిస్థితి వుందన్నారు. అందుచేత ఆయనకు బెయిల్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ పదవి నుంచి తప్పించకపోగా పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోవడం దుర్మార్గమన్నారు. దీన్నిబట్టి చూస్తే ఈ ప్రభుత్వంలో దళితులకు రక్షణ లేకుండాపోయిందన్నారు. రానున్న ఎన్నికలలో ఈ ప్రభుత్వానికి బుద్ది చెప్పాలన్నారు.

## రైతులకు మామిడి, కొబ్బరి మొక్కలు పంపిణీ



**సైదాపురం, డిసెంబరు 16, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొమ్మిపాడు గ్రామంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు కొబ్బరి, మామిడి మొక్కలను గ్రామ సర్పంచు పిన్ను ప్రవంతి చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసీఐసీఐ ఫౌండేషన్ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 9వేల కొబ్బరి మొక్కలు, 6వేల మామిడి మొక్కలను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సిబ్బంది మస్తానమ్మ, మస్తానయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం




**సైదాపురం, డిసెంబరు 16, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ జాతీయ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని మండల టిడిపి అధ్యక్షుడు కట్టా మోహనకృష్ణారెడ్డి తెలిపారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని లింగనపాళెం గ్రామంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ ఇదేమి కర్మ కార్యక్రమంపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా కట్టా మోహన్‌కృష్ణారెడ్డి, తిరుపతి పార్లమెంటు రైతు అధ్యక్షుడు కొందూరు సుబ్రహ్మణ్యంరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పరిపాలనలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని, గతంలో టీడీపీ పరిపాలనలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి మాత్రమే కనబడుతుందని వారు తెలిపారు. నిత్యావసర సరుకులు, కరెంటు బిల్లులు, ఇసుక తదితర సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ వైసీపీ పరిపాలనకు ప్రజలు బుద్ధి చెప్పి రానున్న ఎన్నికల్లో నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఉపాధ్యక్షుడు నలమాలు వెంకటేశ్వర్లురెడ్డి, తిరుపతి పార్లమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ వరదబండి వెంకటేశ్వర్లురెడ్డి, లింగనపాళెం గ్రామ సర్పంచు ఎల్లంరాజు నరసరాజు, తెలుగు యువత మండల అధ్యక్షుల పద్దాల కిరణ్‌కుమార్ యాదవ్, వెంకటగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోయిన రమేష్‌బాబు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు వెంకటరాజు, భాస్కర్‌రెడ్డి, కూరాకు రాజశేఖర్, నాగరాజు, ఐటీడీపీ మండల కోఆర్డినేటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## చరిత్ర హీనులుగా మిగిలిపోయిన బిసి కార్పొరేషన్ చైర్మన్లు

**కావలి, డిసెంబరు 16 ప్రభాతవార్త:** వైసిపి ప్రభుత్వ పాలనలో బిసి కార్పొరేషన్ చైర్మన్లు చరిత్ర హీనులుగా మిగిలిపోయారని టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పుటూరి బాలగురుస్వామి దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కల్లబొల్లి మాటలు చెప్పి బిసిలను మోసగించి బిసి ఓట్లతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి బిసిలను పాతాళంలోకి తొక్కేశాడన్నారు. బిసిలకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా సక్రమంగా నెరవేర్చలేదన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే నవరత్నాల గురించి చెబుతున్నారని, నవరత్నాలకు, బిసిల హామీలకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. నవరత్నాలు బిసిలకు ఎక్కువ శాతం అందలేదన్నారు. ఉన్న రేషన్‌కార్డులు తొలగించారన్నారు. నమ్మి ఓటు వేసినందుకు జగన్‌రెడ్డి బిసిల నడ్డి విరిచారన్నారు. 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఇచ్చామని ఊకదంపుడు ప్రచారం తప్ప బిసిలకు ఒరిగిందేమి లేదన్నారు. వైసిపిలో వున్న రాజకీయ నిరుద్యోగులైన 56 మందికి చైర్మన్లు ఇచ్చారని ఎద్దేవ చేశారు. 672 మందికి డైరెక్టర్ల పదవులు ఇచ్చి 8 నెలలు కావ స్తున్నా కూర్చున్నేందుకు కుర్చీలు ఇవ్వకుండా వైసిపి ప్రభుత్వం అవమానించిందని విమర్శించారు. 56 కార్పొరేషన్లు ఇచ్చి ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వకుండా మోసం చేసిన సియం జగన్‌రెడ్డి చరిత్రపుటల్లో నిలిచిపోయారన్నారు.నోరు మెదపలేక బిసి కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు దద్దమ్మలు లాగా చరిత్ర హీనులుగా మిగిలిపోయారని తీవ్ర స్థాయిలో ఆయన దుయ్యబట్టారు.

## గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం



**ఆత్మకూరు,డిసెంబర్16ప్రభాతవార్త:** రాష్ట్రంలో 2024లో వైఎస్ఆర్‌సిపికి అత్యధిక మోజార్టీ సాధించేలా గెలుపే ధ్యేయంగా పనిచేద్దామని ఆత్మకూరు నియోజకవర్గ పరిశీలకులు ఎస్.గురుమోహన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆత్మకూరు పట్టణ ,రూరల్ మండల నాయకులు,ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గురుమోహన్ మాట్లాడుతూ పార్టీలో సంస్థాగతంగా లోటుపాట్లను గుర్తించి చర్చించుకునేలా కృషి చేద్దామన్నారు.రాష్ట్ర ఆర్థికపరిస్థితి బాగా లేకున్నా వాటిని గత మూడేళ్ళుగా కరోనా కష్టకాలంలోను , పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిదేనన్నారు. దాంతో ఇతర రాష్ట్రాలు మన రాష్ట్ర సంక్షేమ పథకాలపై అధ్యయనం చేస్తున్నాయన్నారు. వాలంటీర్ వ్యవస్థను తమిళనాడు,ఒరిస్సా ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేక అధికార బృందాలు వచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించారన్నారు. రానున్న 2024లో వైఎస్ఆర్‌సిపి అత్యధిక స్థానాల్లో గెలిచేందుకు ఇప్పటినుంచే కృషి చేసే గృహసారధులను ,సచివాలయాలకు కన్వీనర్లను నూతనంగా నియమిస్తున్నా మన్నారు .వీరితో మండల,పట్టణనాయకులు ,కార్యకర్తలు సమన్వయం చేసుకుంటూ అభ్యర్థుల గెలుపుకు కృషి చేద్దామన్నారు. సమస్యల గురించి వివరించమని గురుమోహన్ కోరగా పలువురు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు.వాటిని ఆయన వివరంగా నమోదుచేసుకొని ఎమ్మెల్యే స్థాయిలో , జిల్లా నాయకుల స్థాయిలో పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకులు గురుమోహన్ హామీ ఇచ్చారు. ముందుగా ఈసమన్వయ సమావేశానికి వచ్చిన గురుమోహన్‌ను వైసిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపల్ చైర్మెన్ గోపవరపు వెంకటరమణమ్మ, వైస్‌చైర్మెన్‌లు డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, సర్దార్, ఆత్మకూరు పట్టణ వైసిపి అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మెన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, రూరల్, మండలానికి చెందిన పలువు నాయకులు, కార్యకర్తలు, వైసిపి సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు , నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

## అద్దె ఇవ్వలేదని తాళం వేసిన యజమాని



**కలువాయి డిసెంబర్ 16 ప్రభాతవార్త:** మండలకేంద్రమైన కలువాయిలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు భవనానికి ఆరికట్ల సుబ్బరాయుడు తాళం వేశారు.ఇంటి అద్దె చెల్లించకపోవడంతో భవనానికి తాళం వేయడం జరిగిందని యజమాని తెలిపారు.బ్యాంకు ప్రారంభ సమయం10 గంటలకు సిబ్బంది ఎవ్వర్ని లోనికి వెళ్లనివ్వకుండా ఆయన తాళం వేశారు.

గత పది నెలలుగా అద్దె చెల్లించలేదని దీనితో పాటు అగ్రిమెంట్ పూర్తి అయినా తిరిగి రాయాలని అడిగినా పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో భవనానికి తాళం వేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.బ్యాంకు సిబ్బంది కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసుల జోక్యం చేసుకొని యజమానిచేత తాళం తీయించారు.బ్యాంకు ఖాతాదారులు ఈ సంఘటనతో నివ్వెర పోయారు.

## సైన్స్ ఎగ్జిబిషన్‌లో శ్రీవివేకానంద స్కూల్ ఫస్ట్



**బుచ్చి డిసెంబర్ 16 ప్రభాతవార్త** డిఎల్ఎన్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయిలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో శ్రీవివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు మొదటి స్థానం సాధించారు. 8వ తరగతికి చెందిన జె .దీక్షిత,కె భార్గవి, ఆరోగ్యం,పరిశుభ్రత అనే అంశం నుండి మండల స్థాయిలో మొదటి బహుమతి గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపిక అయ్యారు.విద్యార్థులను ఎంఇఒ దిలీప్‌కుమార్,పాఠశాల కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయులు జార్జిరా య్,ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం



**బిట్రగుంట, డిసెంబరు 16 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్ నెం.1 కొత్త బిల్డింగ్ సమీపంలో ఎలక్ట్రికల్ రూమ్ వద్ద బయట ప్రయాణికులు కూర్చునే అరుగు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు జిఆర్‌పి ఎస్ఐ అరుణకుమారి తెలిపారు. మృతుని వయసు 50-55 సంవత్సరాల మధ్య వుంటుందని, బిస్కెట్ కలర్ ఫుల్‌హ్యాండ్ షర్ట్, సిమెంటు రంగు ఫ్యాంట్ ధరించి వున్నాడని తెలిపారు. విచారించగా అనారోగ్యంతో మృతి చెందాడని, మృతుడు బిక్షాటన చేస్తుండేవాడని తెలిసిందన్నారు. విధి నిర్వహణలో వున్న స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం



**బుచ్చి డిసెంబర్ 16 ప్రభాతవార్త** విద్యుత్ చార్జిలు పెంచారు..... ఆర్టీసి చార్జిలు పెంచారు..... నిత్యావసర సరుకులు విఘరీతంగా పెంచారు.సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పక్కరాష్ట్రాలు బెంగుళూరు,చెన్నై,హైదరాబాద్‌కు తరలిపోతున్నారని కోవూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి విమర్శించారు.మాజీ శాసనసభ్యులు పోలంరెడ్డి శ్రీనివాసులు అద వ్యక్షతన ఇస్కపాళెం పంచాయితీ పరిధిలోని పల్లాప్రోలు గ్రామంలో జరిగిన రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు వాలింటర్‌కు గౌరవవేతనం ఇస్తు దానిని ఉద్యోగాలుగా చూపించడం ఏమిటని ప్రశ్నించారు. పాఠశాలలు తరలించి ఉపాధ్యాయుల్ని తగ్గించి వేశాడని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం హయాంలో కంపెనీలు ఈ రాష్ట్రానికి రావాలంటే హడలిపోతున్నారని పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయని చెప్పారు.రాష్ట్రంలో నిరుద్యోగులు పెరిగిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఈ ప్రభుత్వం విషయంలో విసిగిపోయారని టిడిపి ప్రభుత్వం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతు కోవూరు నియోజకవర్గం సర్వం మాఫియా మయమైపోయిందని విమర్శించారు. కొద్ది మందికి సంక్షేమపథకాలు ఇచ్చి అభివృద్ధికి స్వస్తి పలికారని విమర్శించారు.కోవూరు నియోజవకర్గంలో ఎమ్మెల్యే,ఆయన అనుచరులు దోచుకుంటున్నారని విమర్శించారు.ప్రజల్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలువునా ముంచాడని విమర్శించారు.ప్రజలకు సంక్షేమపథకాల బూచిని చూపి అన్ని విధాలా దోచుకుంటున్నారని అన్నారు.కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి రాజకీయ భిక్షపెట్టింది టిడిపి,చంద్రబాబు కాదా అని ఆయన ప్రశ్నించారు.నవరత్నాల పేరుతో నవదోపిడిచేస్తున్నారని విమర్శించారు.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని విమరి ్శంచారు.ఈకార్యక్రమలో పార్లమెం టరీ అధికార ప్రతినిధి చెముకుల కృష్ణచైతన్య,జిల్లా రైతువిభాగం నాయకులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, మండల పార్టీ నాయకులు ఎం.వి శేషయ్య, జిల్లాబిసి సంఘం నాయకులు బత్తల హరికృష్ణ,కావలి వెంకటేశ్వర్లు, తాళ్ల నరసింహస్వామి,వింజం రామానాయుడు,దుగ్గిశెట్టి హరినాద్,బండ్లకొండయ్య, వల్లూరుశ్రీనివాసులు, దశరద్,రాష్ట్ర మైనార్టీనాయకులుషేక్‌జాపర్‌భాషా,సొల్లే టి ప్రభాకర్,నియోజవకర్గ క్రిష్టయన్ మైనార్టీ నాయకులు ఉసురుపాటి ప్రసాద్,లక్ష్మయ్య,షబ్బీర్,సర్దార్,పలువురు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గో న్నారు.

## నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



**బిట్రగుంట, డిసెంబరు 16 ప్రభాతవార్త** బోగోలు మండలం ఉమామహేశ్వరపురం గ్రామంలో శుక్రవారం కాంద్ర సతీష్‌నాయుడు యువనేస్తం టీమ్ ద్వారా దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్లోబల్ విద్యాసంస్థ అధినేత సాదనాల దామోదర్‌నాయుడు చేతుల మీదుగా ఈ దుప్పట్లు నిరుపేదలకు అందించారు. వర్షాకాలంలో పేద ప్రజలు చలికి ఇబ్బందిపడుతున్న విషయాన్ని గుర్తించి వీటిని పంపిణీ చేయాలన్న ఆలోచన రావడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన జాగృతి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల వెంకటపతి, జైభీమ్ అంబేద్కర్ సేవాదళ్ అధ్యక్షులు బత్తుల రవిచంద్ర, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు పైడి హర్ష, ఉపసర్పంచ్ బి.శ్రీనివాసులు, కె.రామచంద్ర, పీట్ల ప్రత్యూష్ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి



**మర్రిపాడు,డిసెంబర్16ప్రభాతవార్త:** ప్రస్తుతం పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గురుజయంతి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మర్రిపాడులోని పశువైద్యశాలలో మాట్లాడుతూ పశువలకు లంపిస్కిన్ అనేది తీవ్రమైన వ్యాధి అని అది ప్రధానంగా ఆవులు, గేదె జాతుల్లో కన్పిస్తుందని, వేడి తేమతో కూడిన వాతావరణం ఉన్న నెలల్లో ఎక్కువగా వ్యాప్తి చెంది శీతాకాలంలో తగ్గిపోతుందన్నారు. ఇది పశువులను ఆశించే కీటకాల వలన వ్యాప్తిచెందుతుందన్నారు. జోరిగ, ఇతర రక్తం పీల్చుఈగలు, దోమల ద్వారా ఈ వైరస్ వ్యాప్తి చెందుతుందన్నారు. పశువులు బయట మేత మేసేటప్పుడు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాం తంలో వ్యాధి ప్రబలుతుందన్నారు. తేలికపాటి వ్యాధి సోకిన పశువులను, వ్యాది పొగిగే కాలంలో ఉన్నప్పుడు సంతలో క్రయ, విక్రయాల ద్వారా , పశువుల అక్రమరవాణాల ద్వారా ఈ వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందుతుందన్నారు. వ్యాధిసోకిన పశువు గాయాల్లో, లాలాజలం, ముక్కు నుంచి వచ్చే స్రావాలు, పాలు, వీర్యంలో ఈ వైరస్ ఉంటుందన్నారు. ఈ వ్యాధితో బాధపడుతున్న పశువులను ఇతర ప్రదేశాలకు రవాణా చేయరాదని, సంతలో క్రయమవిక్రయాలు జరపరాదన్నారు. వ్యాధిబారిన పడన పశువులను వేరేగా కట్టి మేత, నీరుపెట్టాలన్నారు. సాయంత్రం వేళల్లో దోమతెరలు, పశువుల కొట్టంలో వేపాకు పొగ వేయాలన్నారు. గోట్‌ఫాక్స్ వ్యాక్సిన్‌ను ప్రత్యామ్నాయంగా వాడాలన్నారు. మూడుమాసాలు దాటిన పశువుల్లో వ్యాక్సిన్ వేయవచ్చన్నారు. పశువైద్యశాలల్లో వ్యాక్సిన్ వేస్తామని ఆమె తెలిపారు. కావున రైతులు జాగ్రత్తలు పాటించి పశువులను కాపాడాలన్నారు.

## ప్రపంచ వృద్ధుల దినోత్సవం నేడు

**కోవూరు,డిసెంబరు 16 ప్రభాతవార్త** : సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక బైనాసన్స్ కల్యాణ మండపంలో సాయంత్రం 4 గంటలకు 70 సంవత్సరాలు పూర్తయిన సభ్యులకు సత్కారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. వెంకటేశ్వర్లు, సీహెచ్ రమణయ్యలు తెలిపారు. ఈ కార్యక్రమానికి కౌన్సిల్ సభ్యులంతా హాజరు కావాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## వైసీపీ కార్యకర్త కుటుంబానికి ట్రస్టు అండ



**కోవూరు,డిసెంబరు 16 ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త డి. నాగేంద్ర ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంట్లో ఉన్నాడు. వారి ఆర్థిక పరిస్థితిని స్వయంగా పరిశీలించిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఆ కుటుంబానికి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా 50 వేల రూపాయలను నాగేంద్ర భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్ర కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. .ఈ కార్యక్రమంలో కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసపింహులురెడ్డి, జలజీవన్ మిషన్ చైర్మన్ జి. భాస్కర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్, తహసీల్దార్ ఎం. పద్మజ, ఎంపీడీవో శ్రీహరి, ఆర్‌డ బ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్, గృహనిర్మాణ శాఖ డీఈ జగదీశ్వరి, వివిధ శాఖల ఏఈలు పరమేశ్వరలింగం, భాస్కర్‌రెడ్డి, జగదీష్, రమేష్, నేతలు రమణయ్య, పరంధామయ్య, కె. మల్లికార్జున, చిరంజీవి, కె. ప్రసాద్,అంజన్‌రావు, సీసీఎస్ క్యాటరింగ్ అధినేత చంద్రశేఖర్, , తదితరులు ఉన్నారు.

## ముస్లీం మైనారిటీల విద్యార్థుల స్కాలర్‌షిప్ రద్దు చేయడం దారుణం




**నెల్లూరు టౌన్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ముస్లీం మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్ రద్దు చేయడం అత్యంత దారుణమని మైనార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మైనారిటీ నాయకులు మాట్లాడుతూ ముస్లీం మైనారిటీలను విద్యకు దూరం చేసే కుట్ర బీజేపీ ప్రభుత్వం మానుకోవాలని, యూనిఫాం సివిల్ కోడ్ బిల్లు రాజ్యసభలో ప్రవేశపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని, దీనిని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజ్యసభ సభ్యులు, పార్లమెంట్ సభ్యులు వీటిని ఖండించాలన్నారు. 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు చదివే మైనారిటీ విద్యార్థులకు అందించే ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్, పోస్ట్ గ్రాడ్యుయేట్ చదివే విద్యార్థులకు మౌలానా ఆజాద్ పేరుతో ఇచ్చే స్కాలర్‌షిప్‌లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమని ముస్లీం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మొహమ్మద్ జియా ఉల్‌హక్ అన్నారు. ఇప్పటికే ముస్లీం మైనారిటీ వర్గ ప్రజలు ఉపాధి లేక వచ్చే కొద్దిపాటి స్కాలర్‌షిప్‌లతో చదువులు సాగిస్తున్న విద్యార్థులకు ఆ చదువులు కూడా అందకూడదనే దురాలోచనతో కేంద్ర ప్రభుత్వం మైనారిటీ విద్యార్థులకు ప్రీ మెట్రిక్, పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కాలర్‌షిప్ రద్దు చేసిందని, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం మైనార్టీ వర్గాలకు ఉపాధి, విద్య అందకుండా చేస్తుందని, దీంతో చాలా మంది నిరుపేద మైనారిటీ విద్యార్థులు చదువుకు దూరమవుతారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ నిరసనను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. యూనిఫాం సివిల్ కోడ్ అసాధ్యమని తేల్చి చెప్పిన లా కమిషన్ చైర్మన్ జస్టిస్ బల్బీర్ సింగ్ చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బలవంతంగా యూనిఫాం సివిల్ కోడ్ అమలులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజ్యసభ సభ్యులు, పార్లమెంట్ సభ్యులు యూనిఫాం సివిల్ కోడ్‌ను తీవ్రంగా ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ జియాఉల్‌హక్, మౌలానా అబ్దుల్ అజీజ్, మౌలానా కిఫాయతుల్లా, హాజీ సందానీసాబ్, హాజీ మొహమ్మద్ హనీఫ్‌సాబ్, షేక్ మున్నా, మొహమ్మద్ ఉమర్, షేక్ అల్లావుద్దీన్, షేక్ ముజాహిద్, అబ్దుర్‌రెహమాన్, మొహమ్మద్ షాహుల్, హఫీజ్, గౌస్‌బాషా, అఫ్జల్, రఫి, సులేమాన్, ఏజాస్, అబ్దుల్ సుభహాన్, యూనుస్ తదితరులు పాల్గొన్నారు.

## రూపకు ఎన్టీఆర్ కళారత్న అవార్డు బహుకరణ




**నెల్లూరు టౌన్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** ఎన్టీఆర్ శత జయంతి వేడుకలను పురస్కరించుకుని పినాకినీ యూత్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నెల్లూరులోని బివి నగర్ నందు నటి రూప రెడ్డికి ఎన్టీఆర్ కళారత్న అవార్డును బహుకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పేర్నపాటి శ్రీరామరాజు మాట్లాడుతూ తెలుగు జాతిని, తెలుగు ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన నందమూరి తారకరామారావు యుగపురుషుడని అన్నారు. పినాకినీ యూత్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీమోహన్‌రాజు మాట్లాడుతూ తెలుగు సినిమా ఉన్నత కాలం నందమూరి తారక రామారావు పేరు నిలిచి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నటి రూపను అవార్డుతో ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ సభ్యులు నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, కానూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



**బుచ్చి డిసెంబర్ 16 ప్రభాతవార్త**బుచ్చిరెడ్డిపాళెం డిఎల్ఎన్ఆర్ హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేశారు.ఈకార్యక్రమాన్ని ఎంఇఒ దిలీప్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు నాగపద్మతో కలిసి ప్రారం భించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ ప్రదర్శనకు జగదీష్ చంద్రబోస్ వైజ్ఞానిక ప్రాంగణంగా నామకరణం చేయడం జరిగిందని అన్నారు. విద్యార్థులలో దాగి వున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలను,సాఫ్ట్‌వేర్ యాప్స్, పర్యావరణరహితమోడల్స్ మానవాళికి,సమాజానికి ఉపయోగపడే విధంగా ఉన్నాయని ప్రశంసించారు.సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు ప్రభుత్వ,ప్రవేటు పాఠశాలల నందు పిల్లలందరు పాల్గోనడం అభినందనీయమని అన్నారు. ఐదు ప్రాజక్టులను ప్రదర్శనకు ఎంపిక చేసి త్వరలో జిల్లా స్థాయిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రదర్శనలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ఎన్ మృదుల,టి మస్తానయ్య, వ్యవహారించారు.ఈకార్యక్రమంలో మినగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంమోహన్, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు హర్షద్ అలీ, మస్తాన్, కామేశ్వరరావు, సబితాజ్, సిఆర్పీలు, మల్లేశ్వరరెడ్డి, మహేష్,మస్తానయ్య, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గోన్నారు.

## నటి అలేఖ్యకు స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ అవార్డు ప్రధానం



**నెల్లూరు టౌన్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** గోల్డెన్ స్క్రీన్ 28వ అవార్డుల ప్రధానోత్సవంలో భాగంగా బుల్లితెర నటి అలేఖ్యకు అవార్డు వరించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ అధినేత గిరిరాజ్ నిర్వహించిన అవార్డు వేడుకల్లో భాగంగా శతమానంభవతి సీరియల్‌కు గాను ప్రముఖుల చేతుల మీదుగా అలేఖ్యకు అవార్డు అందజేశారు. తెలంగాణా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి పార్థసారథి, డీసీపీ రాందాస్, టీవీ అసోసియేషన్ వ్యవస్థాపక అద్యక్షులు నాగబాల సురేష్‌కుమార్, దైవజ్ఞశర్మ తదితర ప్రముఖుల చేతుల మీదుగా అలేఖ్యను శాలువాతో సత్కరించి షీల్డు అందజేశారు. వెండితెర, బుల్లితెరలపై తన నటనతో పాటు, నెల్లూరు జిల్లా హిజ్రాల సంఘం అధ్యక్షురాలిగా అలేఖ్య పేదలకు ఎన్నో సేవలు అందించారు. కరోనా సమయంలో ఆమె అందించిన ఎన్నో సేవలు ప్రతి ఒక్కరికి గుర్తుకు వస్తుంటాయి. సమైక్య ఆంధ్ర ఉద్యమంలోను చురుకైన పాత్ర పోషించారు. ఈ సందర్భంగా శుక్రవారం అలేఖ్య మాట్లాడుతూ తాను అందించిన సేవలకు గుర్తుగా స్వాతి ఆర్ట్ క్రియేషన్స్ అధినేత గిరిరాజ్ తనకు ఈ అవార్డు అందించడం ఆనందంగా ఉందన్నారు. గిరిరాజ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## బీద రమణయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న బియంఆర్



**అల్లూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త** రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు తన స్వగ్రామమైన ఇస్కపల్లి గ్రామంలో శుక్రవారం తన తండ్రి బీద రమణయ్య వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. బీద మస్తాన్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి ఆయన తండ్రి సమాధి వద్ద నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, కావలి మాజీ ఎయంసి చైర్మన్ దేవరాల సుబ్రమణ్యం, సన్నిహితులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

## పచ్చని పైరును ద్వంసంచేశారు



**జలదంకి, డిశంబర్16,ప్రభాతవార్తః** పొలంలోని పచ్చనిపైరును ట్రాక్టర్‌తో ద్వంసచేసి పాపం ఆరైతును గోడు మనిపించారు.ఈఘటన జలదంకి మండలం గోపన్నపాళెంలో గురువారం అర్ధరాత్రి జరిగింది.ఆజామున అటుగా వెళ్తూ అదేమని ప్రశ్నించబోయిన గ్రామవాసిని నెట్టివేసిమరీ ఈదారుణానికి పాల్పడ్డారు.శుక్రవారం ఉదయాన్నే లేచిని పొలం యజమానికి పదుగురు ఈవిషయం చెప్పగావిని పరుగున పొలంలోని వెళ్ళి పరికించిచూసి బావురమన్నాడు.లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించి తనకు జరిగిన అన్యాయాన్ని గూర్చి ఫిర్యాదుచేసి న్యాయంచేయాలని వేడుకున్నాడు. దీనికి సంబందించి రైతు కథనంమేరకు వివరాలు ఇలావున్నాయి.మండల పరిదిలోని గోపన్నపాళెం గ్రామానికి చెందిన ఎదురూరి.రామిరెడ్డి తనకుగల తిమ్మసముద్రం రోడ్‌కు సమీపంలోని సర్వేనంబర్ 1820లోగల4.32 ఎకరాల భూమిని గత ముపైఏళ్లగా సాగుచేసుకుంటున్నాడు.దానికి సంబందించిన అన్నిహక్కులను కలిగివున్నాడు.అయితే గ్రామానికి చెందిన సత్యనారామణ కృష్ణారెడ్డి,వెంకారెడ్డి,రమణారెడ్డి,జనార్ధన్,రమణారెడ్డిలు అకారణంగా రాత్రివేళ ట్రాక్టర్‌తో తొక్కించి మూడుకయ్యలలోని పైరు నిలువునా నాశనం చేశారని విచారం వ్యక్తంచేశాడు,ఈవిషయం ప్రత్యక్షంగా చూసిన దొరబాబు అనేవ్యక్తి చెప్పగావిని విచారించి రూఢీచేసుకున్నానన్నాడు.విత్తనాలు,నారుమడి,సేద్యం,నాట్లు వంటివాటిని పూర్తిచేసి పొలంలో పైరుఎక్కించాలంటే ఎంత శ్రమకోర్చాల్సి వస్తుందో రైతులోకానికి అందరికి ఎరుకని కాని అంతకష్టపడి పైరు పెట్టుకుంటే దానిని పాడుచేయడానికి వారికి మనసెలా వచ్చిందోనని ఆవేదన వ్యక్తంచేశాడు.పోలీసులు విచారించి దీనికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయంచేయాలని వేడుకున్నాడు.

## శైలపుత్రి అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



**కావలి, డిసెంబరు 16 ప్రభాతవార్త** కావలి పట్టణ తుమ్మలపెంట రోడ్డులోని వరహా వెంచర్ ప్లాట్స్‌లో కావలి మాజీ ఎయంసి చైర్మన్, వైసిపి కీలక నేత మన్నెమాల సుకుమార్‌రెడ్డి, కల్పన దంపతుల సారథ్యంలో సాగుతున్న సహస్ర రుద్ర సహిత సహస్ర చండీయాగంలో భాగంగా శుక్రవారం శైలపుత్రి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నెల 15వ తేది నుంచి 22వ తేది వరకు శాస్త్రోక్తంగా హోమ పారాయణం జరుగుతున్నాయి. రుత్వికులు, వేదపండితులు హోమ పూజలు చేశారు. చండీ పారాయణం, చతుర్వేద పారాయణం, మహాన్యాస పూర్వక, అన్యోన్య సహిత శతరుద్ర పారాయణం, అమృత మహాపాశుపతం, జపాభిషేకంలు వైభవంగా నిర్వహించారు. సంతాన గోపాలజపం, గణపతి హోమం, రుద్రహోమం, పాశుపత సహిత చండీ హవనం, రుద్రహోమం, నవగ్రహ హోమం, విశేష అర్చన, శ్రీయంత్రం, పూజ హోమం, నాగహారతి, తదితర విశేష పూజల్ని వేదపండితులు నిర్వహించారు. శుక్రవారం మన్నెమాల కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు నిర్వహించారు. తుమ్మలపెంట రోడ్డులోని లేఅవుట్‌లో జరిగే ఈ వేడుకల్లోని వేదమంత్రాలు కావలి పట్టణమంతా వినేలా ప్రత్యేకంగా మైకులు ఏర్పాటు చేశారు. యాగశాల వద్ద ఉదయం, రాత్రి పోలీసుల బందోబస్తు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది.

## కార్పోరేటుకు ధీటుగా కందుకూరు ప్రభుత్వ కళాశాల



కందుకూరు/వలేటివారిపాలెం డిశంబరు 16,ప్రభాతవార్తకందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా॥ రవికుమార్ అన్నారు. శుకృవారం కళాశాల ఆవరణలో డిగ్రీ,మరియు పీజీ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రెషర్స్‌డే నిర్వహించారు.సీనియర్ విద్యార్థులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్పోరేట్ కళాశాలలకు ధీటుగా సకల సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చే సుకోవాలని ఆయన సూచించారు.ఉన్నత విద్యార్హతలె గలిగి అధ్యాపకులుతోపాటు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను నిర్దేశించడానికి అన్ని హంగులు న్నాయన్నారు.పలువురు అధ్యాపకులు, సిబ్బందిపాల్గొన్నారు. సాంస్కృతికి కార్యక్రమాలు నిర్వహించారు.

## సంగం బిసి బాలికల హాస్టల్ పరిశీలించిన ఎబిసిడబ్ల్యూ



**సంగం డిసెంబర్ 16 ప్రభాతవార్త** సంగం బిసి బాలికల వసతిగృహాన్ని ఎబిసిడబ్ల్యూ శ్రీదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్దులను మెను గురించి ప్రశ్నించారు. విద్యార్దులు సంతృప్తి కరంగా సమాధానం ఇవ్వడంతో ,ఉదయాన్ని టి పిన్ పరిశీలించారు. టిపిన్ రుచి చూసి బాగుంద నిహాస్టల్ వార్డన్ మల్లేశ్వరమ్మను అభినందించా రు. అలాగే హాస్టల్‌లో విద్యార్దినుల గదులు కూడా పరిశీలించి వారికి పలుసూచనలు చేశారు. ఈ సంవత్సరం కూడా పదోతరగతిలో ఉత్తమ ఫలి తాలుతేవాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

## గేమ్స్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన యూనివర్శిటీ విద్యార్థులు



**కావలి రూరల్, డిసెంబరు 16 ప్రభాతవార్త** ఇటీవల జరిగిన విక్రమ సింహపురి యూనివర్శిటీ ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్లో కావలి విక్రమ సింహపురి యూనివర్శిటీ విద్యార్థినులు మహిళా విభాగంలో గేమ్స్ ఓవ రాల్ ఛాంపియన్ షిప్ సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చిలుమూరి శ్రీనివాసరావు వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విక్రమ సింహపురి యూనివర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ జి.యం.సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డిలు క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించడం చాలా సంతో షంగా వుందని తెలిపారు. వీరి సహాయ సహకారాలతో పిడి సి.హెచ్.మణికంత విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వ డంతో ఈ విజయాన్ని సాధించడం జరిగిందని తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు బాల్‌బ్యాడ్మింటన్, షటి ల్, టెన్నీస్ సింగిల్స్ అండ్ డబుల్స్, టేబుల్ టెన్నీస్ డబుల్స్ విభాగంలో విన్నర్‌గా నిలవడం జరిగిం దన్నారు. అలాగే హ్యాండ్ బాల్, టేబుల్ టెన్నీస్ సింగిల్స్ రన్నర్స్‌కు నిలిచారన్నారు. పురుషుల విభాగంలో బాల్ బ్యాట్‌మెంటన్‌లో రన్నర్స్‌గా, ఫుట్‌బాల్‌లో రన్నర్స్‌గా, ఆఫ్ టేబుల్ టెన్నీస్ సింగిల్స్ అండ్ డబుల్స్‌లో రన్నర్స్‌గా నిలవడం జరిగిందని తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో విఎఎ ఆత్మహత్యాయత్నం



**మనుబోలు, డిసెంబరు 16 ప్రభాతవార్త** మండలంలోని అక్కంపేట గ్రామ సచివాలయంలో విఎఎగా(అగ్రికల్చర్ అసిస్టెంట్) పనిచేస్తున్న ఉప్పు ప్రతాప్ ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంకటాచలంలోని జాతీయ రహదారి పక్కనే వున్న శనీశ్వ రస్వామి దేవాలయంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ప్రతాప్‌ను గుర్తించి పోలీసులు చికిత్స నిమిత్తం బొల్లినేనికి తరలించారు. మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎవో జకీర్‌లు పరామర్శించి దగ్గరుండి చికిత్సలు అందిస్తు న్నారు. వైద్యఖర్చుల నిమిత్తం మనుబోలు వాలంటీర్ తుపాకుల గిరి కొంత నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు.

## ఇ-కామర్స్‌పై ప్రశ్నించిన రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి



**నెల్లూరు కార్పోరేషన్ డిసెంబర్ 16 ప్రభాతవార్త** ఆన్‌లైన్ ప్లాట్ఫార్మ్‌ల లో నకిలీ లేదా ప్రాయోజిత లేదా మోసపూరిత సమీక్షలను తీసివే యడానికి వాటిని ప్రమాణీకరించడానికి ప్రభుత్వ మార్గదర్శకాలను జారీ చేయనుందనే విషయం వాస్తవమేనా అని రాజ్యసభ్యులు వేమి రెడ్డి ప్రభాకర్‌రెడ్డి పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనికొరకు ఒక కమీటి ని ఏర్పాటు చేయడం నిజమేనా అని అన్నారు. అటువంటి ప్రయ త్నం చేసిన మొదటి దేశం భారతదేశమేనా అలా అయితే దాని వివ రాలు తెలుపమని లిఖితపూర్వకంగా ప్రశ్నించారు. అందుకు స్పందిం చిన కేంద్ర మంత్రి అశ్వినికుమార్‌చౌబె వినియోగదారుల వ్యవహారల శాఖ ఇ-కామర్స్‌లో నకిలీ మరియు మోసపూరిత సమీక్షలను తనిఖీ చేయుటకు ఫ్రేమ్ వర్క్‌ను అభివృద్ధి చేయడానికి 10.06.2022 న ఒక కమీటిని ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఈ కమీటిలలో ఇ-కామర్స్ కంపెనీలతో సహా వివిధ వాటాదారులు, పరిశ్రమ సంఘాలు, వినియోగదారుల సంస్ధలు, మరియు న్యాయవాద రంగానికి చెందిన వారు ఉన్నారు. ఈ కమీటిలలో ఇ-కామర్స్ నకిలీ మరియు మోసపూరిత సమీక్షల నుండి వినియోదారుల ఆసక్తిని గుర్తించి రక్షించడం కోసం, బ్యూరోఆఫ్ ఇండియన్ స్టాండర్ స్ వాటి సేకరణ, నియంత్రణ మరియు ప్రచురణకోసం సూత్రాలు, అవసరాలు, ఆన్‌లైన్ కన్యూమర్‌రిపూ వ్యస్ ఫ్రేమ్ వర్క్‌ను 23.11.2022 న నోటిపై చేయడం జరిగిందని తెలిపారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతాంగానికి 80 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేసేలా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ బండారుమాన్యం ప్రాంతంలో శుక్ర వారం రైతులకు సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి అనేక వినూత్న పథకాలను ఏర్పాటు చేయడమే కాకుండా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారు. సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత మాట్లాడుతూ ముంపుకు గురైన వరినారుమడులు, వరినాట్లకు 80 శాతం సబ్సిడీతో నెల్లూరు జిల కర ఎన్ఎల్ఆర్ 33449, షుగర్‌లెస్ ఆర్ఎన్ఆర్ 15048 విత్తనాలను సరఫరా చేస్తున్నామన్నారు. విత్తనా లు కావాల్సిన రైతులు తమ తమ ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్‌తో సంబంధిత రైతుభరోసా కేంద్రాల్లో సంప్ర దించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డి. నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, డీఎల్‌డీపి డైరెక్టర్ దినేష్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసపింహులురెడ్డి, జలజీవన్ మిషన్ చైర్మన్ జి. భాస్కర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, నల్లపరెడ్డి రాహీన్‌కుమార్‌రెడ్డి, రాజేంద్రకుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ అహ్మద్, తహసీల్దార్ ఎం. పద్మజ, ఎంపీడీవో శ్రీహరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్, గృహని ర్మాణ శాఖ డీఈ జగదీశ్వరి, మండల వ్యవసాయాధికారి ఇందిరావతి, వివిధ శాఖల ఏఈలు పరమేశ్వ రలిం గం, భాస్కర్‌రెడ్డి, జగదీష్, రమేష్, , తదితరులు ఉన్నారు.

## వైభవంగా ధనుర్మాస పూజలు



**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఆరంభం సందర్భంగా విష్ణు సహస్ర నామ పారాయణాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చంద్రబాబుకు మతి భ్రమించింది



**కోవూరు, డిసెంబరు 16 ప్రభాతవార్త :** గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ ఏ మేర ఈ మూడు సంవత్సరాల్లో నిధులు పంపిణీ చేసిందో స్వయంగా తెలుసుకుని ఆనందపడేందుకు ఈ కార్యక్రమంల ఎంతో దోహదపడిందని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ బండారుమాన్యం, సత్యవతినగర్, చిన్న పడుగుపాడు ప్రాంతాల్లో శుక్ర వారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సంద్దర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలు ద్వారా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందడంతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మతిభ్రమించి పిచ్చి పట్టిందన్నారు. దీంతో ఆయన ఏం మాట్లాడుతున్నాడో అర్థం కాని పరిస్థితి ఏర్పడింద న్నారు. ఉదయం లేచింది మొదలుకుని ప్రభుత్వాన్ని, ముక్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే తప్ప వేరే పని లేదన్నారు. కొత్త రాష్ట్రంలో 5 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి ఏం చేశాడో ప్రజలకు చెప్పాలన్నారు. ఈ మూడు సంవత్సరాల కాలంలో ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రత్యక్షంగా చూసిన చంద్రబాబు నాయుడు పిచ్చి వాగుడు వాగుతున్నారన్నారు. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉండగా.. 600 వాగ్దానాలు చేసి ఒక్కటి కూడా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. గతంలో ఏ పథకం రావాలన్నా జన్మభూమి కమిటీకి చేయి తడిపితేనే పథకాలు వచ్చేవని, ప్రస్తుతం ఈ ప్రభుత్వంలో విజయ వాడలో బటన్ నొక్కితే నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ అవుతున్నాయన్నారు. అదే ఆ ప్రభుత్వానికి , ఈ ప్రభుత్వానికి తేడా అన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు అవాకులు చవాకులు మానుకునిబుద్దిగా ఉండాలని హితవు చెప్పారు. రాష్ట్రంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా కేవలం మన రాష్ట్రంలోనే చరిత్రలో నిలిచిపోయే పథకాలు ఏర్పాటు చేసి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో కొలువై ఉన్నారన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు చేస్తున్న సేవలు నిరుపమానం అన్నారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి ప్రభుత్వ బుక్‌లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యయసాయ సలహా మండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, డీఎల్‌డీపి డైరెక్టర్ దినేష్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ టి. పార్వతి, వైస్ ఎంపీపీ నరసపింహులురెడ్డి, జలజీవన్ మిషన్ చైర్మన్ జి. భాస్కర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్,, రమేష్, నేతలు రమణయ్య, పరంధామయ్య, కె. మల్లికార్జున, చిరంజీవి, కె. ప్రసాద్, అంజన్‌రావు, సీసీఎస్ క్యాటరింగ్ అధినేత చంద్రశేఖర్, , తదితరులు ఉన్నారు.

## దివ్యాంగ ఉద్యోగులకు విధుల కేటాయింపు



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థలో ఉద్యోగులుగా బాధ్యతలు స్వీకరించిన 7 మంది దివ్యాంగులకు వివిధ విభాగాల్లో విధులను కేటాయి స్తూ కమిషనర్ హరిత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల మేరకు పబ్లిక్ హెల్త్ విభాగం వర్క ర్లుగా నాగరాజుపల్లి అమర్‌నాథ్, కసినపోగు శ్రీనివాసులు, ఎస్టాబిలెష్ మెంట్ విభాగంలో శనగపల్లి ప్రభాకర్, ఎ.వేణుగోపాల్, ఇంజనీ రింగ్ విభాగంలో చెన్నుపాటి మమత, పులి క్రాంతి, మర్రి సుక న్యలకు విధులు కేటాయించారు. కేటాయించిన విధులను సిబ్బంది వెంటనే స్వీకరించాలని కమిషనర్ ఆదేశించారు.

## రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయండి



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి, కొళాయి, డ్రైను తది తర రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయాలని సచివాలయ కార్యదర్శులను కమిషనర్ హరిత ఆదేశించారు. స్థానిక 25వ డివిజన్ చెన్నకేశవ నగర్ సచివాలయాన్ని కమిషనర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల అమలు రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించి సచివాలయం పరిధిలోని గృహాలు, కమర్షియల్ భవనాలన్నింటికీ చెత్త సేకరణ బిన్స్ పంపిణీ చేశారా అని విచారించారు. కమర్షియల్ ఆస్తి పన్నులతో పాటు, ఇంటింటి చెత్త సేకరణకు యూజర్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సచివాలయం కార్యదర్శులకు ఆదేశించారు. మంచినీటి కొళాయిల నూతన కనెక్షన్ల మంజూరుకు ప్రజల్లో అవగాహన పెంచాలని, అనుమతులు లేని కనెక్షన్లపై తగిన చర్యలు తీసుకోవాలని సూ చించారు. కార్యదర్శులంతా ప్రభుత్వం సూచించిన డ్రెస్ కోడ్ యూనిఫామ్ ప్రతి రోజూ తప్పక ధరించాలని కమిషనర్ సూచించారు.

## రైతులను ఆదుకోవాలి



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా రైతు సమస్యలపై ఉదారంగా స్పందించి వారిని ఆదుకోవాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సూచించారు. నెల్లూరు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్ రాజుతో శుక్రవారం వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో పాటు ఏఎంసీ చైర్మన్, వివిధ సొసైటీల చైర్మన్లు బేటీ అయ్యారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాలకు నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి పలు ఎకరాలు నీట మునిగాయని, వారిని ఉదారంగా ఆదుకోవాలన్నారు. రైతులకు సంబంధించిన ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు ఎరువులు తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కూకటి హరిబాబుయాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## అభయాంజనేయస్వామి ప్రతిష్ట మహోత్సవం

**వింజమూరు, డిసెంబర్16ప్రభాతవార్త:** వింజమూరు మండలం చాకలికొండ పంచాయతీ పరిధిలోని బత్తినవారిపల్లి ప్రధానరహదారి సమీపంలో ఏర్పాటు చేసిన అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని భక్తులందరూ స్వామివారికి కొబ్బరికాయలు అందించి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ పెద్దలు , బత్తినవారిపల్లి యువత పాల్గొన్నారు.

## గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను విజయవంతం చేయండి




నెల్లూరు అర్బన్, డిసెంబరు 16, ప్రభాతవార్త: విశాఖపట్నంలో వచ్చే మార్చి 3, 4 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను విజయవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023 కు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ సదస్సులో జిల్లాలోని ఔత్సాహికులైన పారిశ్రామిక వేత్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం మారుతీప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం చంద్రశేఖర్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజర్ మహేష్, పరిశ్రమల కేంద్రం డీడీ షఫి అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## జీపీడీపీ శిక్షణా కార్యక్రమం




**నెల్లూరు అర్బన్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ ఆదేశాల ప్రకారం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జీపీడీపీ, బీపీడీపీ, డీపీడీపీ స్థాయిలో ప్రణాళిక తయారులో భాగంగా జిల్లా, మండలం మరియు గ్రామ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి జెడ్పీటీసీఎస్, ఎంపీపీ ఆర్, ఫ్యాక్లిటేటర్స్, ఫ్రంట్‌లైన్ వర్కర్స్, లైన్ డిపార్ట్‌మెంట్ ఫంక్షన్ నీరర్ సభ్యులకు శిక్షణా కార్యక్రమం కొత్త జిల్లా పరిషత్ సమావేశ మందిరం దర్గామిట్టలో జరిగింది. జిల్లాలోని అన్ని మండలాల్లోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు అందరూ పాల్గొని శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా ప్రజా పరిషత్ వైస్‌చైర్‌పర్సన్, జిల్లా ప్రజా పరిషత్ సీఈవో, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## రైతులను దగా చేసిన వైకాపా ప్రభుత్వం



**నెల్లూరు, డిసెంబరు16 ప్రభాతవార్త-విద్య** రాష్ట్రంలో రైతులను నిలువుగా మెసగించి వారిని నష్టాల ఊబిలో కొట్టుమిట్లాడేలా చేసిన ఘనత వైకాపా ప్రభుత్వానికే దక్కుతుందని జనసేన జిల్లా అధ్యక్షులు మనుక్రాంత్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని స్థానిక జనసేనపార్టీ జిల్లా ప్రధానకార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులను మెసగించారన్నారు. నానా ఇబ్బందులు పడి పండిచిన పంటకు గిట్టుబాటు ధర కల్పించటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిదన్నారు. దీంతో అనేకమంది రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యలకు పాల్పడారన్నారు. వీరిని ఆధుకునేంకదు కూడా ముఖ్యమంత్రి పూకుకోకపోవటం విచారకరమన్నారు. రైతు ఆత్మహత్యలపై చలించి తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ మరణించిన రైతు కుటుంబాలకు ఆదుకునేందుకు ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారని గుర్తు చేశారు. ఈ యాత్రను కూడా నిర్వహించకుండా పాలకపక్షం అనేక విధాలైన ఆటంకాలకు సృషి ఒచిందన్నారు. అయినా తాము రైతులను ఆదుకున్నామని, రైతుల కుటుంబాలను విద్య, వైద్యం, ఉద్యోగం, తదితర అన్నీ విధాలుగా ఆదుకున్న ఘనత తమ పార్టీకే దక్కుతుందన్నారు. ప్రకాశం, కర్నూలు, కడప, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, అనంతపురం లలో ని 300మంది రైతు కుటుంబాలకు తమ ఆర్థికసాయం అందింద న్నారు. నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మాట్లాడుతు వైకాపా ప్రభుత్వంలో రైతులు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 320 కోట్ల మేర దాన్యం బకాయిలు ఉన్నారన్నారు. మండూస్ తుపాను దాడికి నష్టపోయిన రైతులను ఆదుకోవటంలో కూడా ప్రభుత్వం గోరంగా విఫలం చెందిదని విమర్శించారు. రైతులకోసం, ప్రజలకోసం నిస్పక్షిపాతంగా సేవ చేస్తున్నది తమ అధినేత మాత్రమేన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 18న గుంటూరులో నిర్వహించ తలపెట్టిన కౌలురైతుల భరోసా యాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయ్యాలని ఆయన కోరారు. అనంతరం రైతు బరోసా యాత్రకు సంభందించిన గోడ ప్రత్తులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దిపూడి సుధీర్, కలువాయి సుధీర్, బోబ్బేపల్లి సురేష్, కోళా విజయలక్ష్మి, సావిత్రి, ఆయేషా, వరకుమార్, సుల్తాన్‌బాషా, పవన్, మధన్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తూరులో గడపగడపకు మన ప్రభుత్వం



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబరు 16, ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ నియోజక వర్గ పరిధిలోని 30వ డివిజన్‌లోని కొత్తూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిర్వహించారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి లబ్దిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి అందిస్తున్న సంక్షేమ పథకాలు వచ్చాయా.. లేదా.. అని అడిగి తెలుసుకుని వారికి సంక్షేమ పథకాల ద్వారా వారు పొందిన లబ్దిని ప్రజలకు వివరిస్తూ అలాగే డివిజన్‌లో ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల వద్దకే పాలన ప్రవేశపెట్టిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని వాలంటీరు వ్యవస్థ ద్వారా నేరుగా లబ్దిదారులకే అందజేస్తున్నానని, తద్వారా ప్రతి ఇంట ఆనందాల వెల్లివిరుస్తున్నాయని సంతోషం వ్యక్త పరిచారు. అనంతరం 30వ డివిజన్ కార్యకర్తలు, నాయకులు, వలంటీర్లు, సచివా లయం సిబ్బందితో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించి వారితో పాటు అల్పాహారం సేవించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్, 30వ డివిజన్ కార్పొరేటర్ కూకటటి ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ కూకటి హరిబాబు యాదవ్, స్థానిక వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వార్త
రిపోర్టర్స్ కావలెను
తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు నగరంలో... నెల్లూరు క్రైమ్, సంతపేట, దర్గామిట్ట, బారకాసు, కొండాపురం మండలంకు విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
వార్త కార్యాలయం, ఎ.కె.నగర్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, నెల్లూరు.
ఫోన్: 7675867756, 9347112031